క్లుప్తంగా

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక


విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

కదిరి అర్బన్: అనంతపురం జిల్లాలోని ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్ -14 బాలికల విభాగం యోగాలో కదిరి జడ్పీ హైస్కూల్ విద్యార్థి దీపిక 108 పాయింట్స్ సాధించి జిల్లాలో ప్రథమస్థానం నిలిచింది. అండర్ -17 విభాగంలో హ్యాండ్‌బాల్‌లో పోటీల్లో పదోవతరగతి విద్యార్థిని హెప్సిబా రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైంది. క్రీడల్లో ఉత్తమ ప్రతిభ కనబరచిన విద్యార్థులను బుధవారం పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకటాచలంతో పాటు పలువురు ఉపాధ్యాయులు అభినందించారు.

మట్టి సేకరణ

రామగిరి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఆజాదీకా అమృత్ మహోత్సవ్ కార్యక్రమంలో భాగంగా మట్టి సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా ఎంపీపీ కర్రెన్న, ఎంపీడీఓ ఫజిల్‌బాషా మాట్లాడుతూ.. మండల వ్యాప్తంగా ఆయా గ్రామ పంచాయతీల నుంచి మట్టిని సేకరించి దేశ రాజధాని ఢిల్లీకి పంపిస్తామన్నారు.

రిజర్వాయర్ పరిశీలన


రిజర్వాయర్‌ను పరిశీలిస్తున్న సీఈ

కదిరి అర్బన్: మండల పరిధిలోని చెర్లోపల్లి రిజర్వాయర్‌ను బుధవారం హెచ్‌ఎన్ఎస్ఎస్ చీఫ్ ఇంజినీర్ శ్రీనివాసరెడ్డి, ఎస్ఈ దేశీ నాయక్, ఈఈ మురళి, డీఈ విశ్వనాథ్‌లు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు డ్యాంలో నీటి మట్టాన్ని పరిశీలించారు. రోజూ 150 క్యూసెక్కుల నీటిని కుప్పంకు విడుదల చేయాలని జేఈ పాండురంగను సీఈ ఆదేశించారు. ప్రస్తుతం ఇన్‌ఫ్లో 130 క్యూసెక్కుల నీరు వస్తోందన్నారు.

15న వాల్మీకి విగ్రహ ప్రతిష్ట


ఎంపీ పీడీ రంగయ్యకు ఆహ్వాన పత్రిక అందిస్తున్న సాంబశివ

బత్తలపల్లి: మండలంలోని ఈదుల ముష్టూరు గ్రామంలో ఈ నెల 15వ తేదీ ఆదివారం వాల్మీకి మహర్షి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు శ్రీసత్యసాయి జిల్లా బోయ సంఘం అధ్యక్షులు బోయ సాంబశివ, తలారి చంద్రశేఖర్ పేర్కొన్నారు. బుధవారం బత్తలపల్లిలో వారు విలేకర్లతో మాట్లాడుతూ ఆదివారం ఉదయం 6.30 నుంచి శ్రీ పుణ్యాహవాచం, గో ప్రదక్షణ, గణపతి పూజ, అంకురార్పణ, హోమాలు, పంచామృతాభిషేకము, యంత్రప్రాణప్రతిష్ట, విగ్రహ ప్రాణప్రతిష్ట కార్యక్రమాలను వేదపండితుల ఆధ్వర్యంలో చేపట్టనున్నట్లు తెలిపారు. వేడుకలకు అనంతపురం ఎంపీ పీడీ రంగయ్య, ఎమ్మెల్సీ మంగమ్మ, జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మతో పాటు పలువురు బోయ, వాల్మీకి సోదరులను ఆహ్వానించినట్లు తెలిపారు.

యోగా పోటీలకు ఎంపిక


విద్యార్థినులను అభినందిస్తున్న దృశ్యం

ముదిగుబ్బ: ముదిగుబ్బ బాలికోన్నత పాఠశాలకు చెందిన విద్యార్థినులు తన్మయి, మంజుల యోగాలో రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయురాలు రమాదేవి, పీడీ రేఖలు తెలిపారు. బుధవారం వారు మాట్లాడుతూ ఈ నెల 28న పశ్చిమ గోదావరి జిల్లా వీరవాసరములో జరిగే రాష్ట్ర స్థాయి యోగా పోటీలలో పాల్గొంటారన్నారు.

తెగి పడిన విద్యుత్ లైన్

ధర్మవరం అర్బన్: పట్టణంలోని చక్రవర్తి థియేటర్ నుంచి కదిరిగేటుకు వెళ్లే రహదారిలో చెలిమి దగ్గర బుధవారం కరెంటు మెయిన్ లైను తెగి కిందకు పడిపోయింది. ఆ సమయంలో కింద ఉన్న కుక్కపై వైరు పడటంతో కుక్క మృతి చెందింది. ఆ సమయంలో ఎవరైనా మనుషులు ఉంటే పెను ప్రమాదం జరిగేదని స్థానికులు వాపోతున్నారు. ట్రాన్స్‌కో అధికారులు వెంటనే విద్యుత్ వైరుకు మరమ్మతులు చేశారు.

గ్యాస్ ఏజెన్సీ తనిఖీ

తనకల్లు: స్థానిక శ్రీ లక్ష్మీ వినాయక గ్యాస్‌ని బుధవారం డీఎస్ఓ వంశీకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో తనిఖీ చేశారు. రికార్డులు, రిజిస్టర్లను పరిశీలించారు. తనిఖీ అధికారులు బృందాలుగా విడిపోయి తనకల్లు, బొంతలపల్లి, కొక్కంటి గ్రామాలలో ఇంటింటా తిరుగుతూ గ్యాస్ వినియోగదారులతో మాట్లాడారు. ప్రభుత్వం నిర్ణయించిన ధర కంటే ఎక్కువకు అమ్ముతున్నారా అని వినియోగదారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం కొక్కంటిక్రాస్‌లో ఉచిత బియ్యం పంపిణీని పరిశీలించారు.

ఇంటి ముంగిటకే పథకాలు

- ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి


ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి

ధర్మవరం రూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ఇంటి వద్దకే సంక్షేమ పథకాలను అందిస్తున్నారని ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి అన్నారు. బుధవారం పట్టణంలోని 33వ వార్డులో 'గడప గడపకూ మన ప్రభుత్వం' కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఇంటింటికి తిరుగుతూ ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాల గురించి ఆరా తీశారు. వార్డులోని ప్రజలు చిన్న చిన్న సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు.అధికారులతో చర్చించి వాటిని పరిష్కరించేందుకు చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేద ప్రజల సంక్షేమం కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిరంతరం కృషి చేస్తున్నారన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా సచివాలయ, వలంటీర్ వ్యవస్థ ద్వారా పార్టీలకు, కుల,మతాలకు అతీతంగా సంక్షేమ పథకాలను అందించే ఏకైక ముఖ్యమంత్రి మన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. రాష్ట్రం మరింత అభివృద్ధి చెందడంతో పాటు అన్ని వర్గాల వారికి మరిన్ని సంక్షేమ పథకాలు అందాలంటే రానున్న ఎన్నికలలో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను గెలిపించి మరోసారి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రి చేయాల్సిన బాధ్యత మనందరిపైనా ఉందన్నారు. ప్రభుత్వం నుంచి ఇంటి పట్టాలు తీసుకున్న ప్రతి ఒక్కరు తప్పని సరిగా ఇంటి నిర్మాణాలను చేపట్టాలన్నారు. మున్సిపల్ కమిషనర్ బండి శేషన్, బడన్నపల్లి కేశవరెడ్డి, కౌన్సిలర్లు భాగ్యలక్ష్మి, చందమూరి నారాయణరెడ్డి, పెనుజూరి నాగరాజు, బ్రహ్మయ్య, కడప రంగస్వామి గజ్జల శివ, హౌసింగ్ ఏఈ బాలాజీ, వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి గుర్రం శ్రీనివాసరెడ్డి, నాయకులు చాంద్‌బాషా, బడన్నపల్లి కేశవరెడ్డి, ఈశ్వర్‌రెడ్డి, తొండమాల రవి, దేవరకొండ రమేష్, కత్తే పెద్దన్న, ఎస్పీ బాషా, జింక కంబగిరి, బెస్త వెంకటరాముడు, కేశగాళ్ల క్రిష్ట, సుభాన్, ఈడిగ వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాధనం దండుకోవడంతోనే బాబుకు జైలు


సీసీ రోడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పీవీ సిద్దారెడ్డి

- ఎమ్మెల్యే పీవీ సిద్దారెడ్డి

కదిరి అర్బన్: ప్రజాధనం దోచుకున్న పాపానికే ప్రస్తుతం జైల్లో చంద్రబాబు ఊచలు లెక్కపెడుతున్నాడని ఎమ్మెల్యే పీవీ సిద్దారెడ్డి విమర్శించారు. మండల పరిధిలోని పట్నం గ్రామంలో నూతనంగా రూ.60 లక్షలు ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో నిర్మించిన సిమెంట్ రోడ్డుకు బుధవారం ఎమ్మెల్యే ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నో ఎళ్లుగా జాతీయ రహదారి నుంచి పట్నం గ్రామం వరకు రోడ్డు సరిగా లేక గ్రామస్తులు ఇబ్బందులు పడ్డారని చెప్పారు. గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రజలు తమకు సీసీ రోడ్డు కావాలని అడిగారని, వెంటనే రూ. 60 లక్షలు నిధులు మంజూరు చేయించి త్వరిత గతిన పనులు పూర్తి చేశామని పేర్కొన్నారు. పట్నం మాజీ సర్పంచ్ గంగిరెడ్డిని ఆయన అభినందించారు. నియోజకవర్గంలో దశాబ్దకాలం రోడ్డు సౌకర్యానికి నోచుకోని 130 గ్రామాలకు సైతం సీసీ రోడ్లు, బీటీ రోడ్ల నిర్మాణం చేపట్టామని చెప్పారు. 40 ఇయర్స్ ఇండస్ట్రీ అని చెప్పుకునే చంద్రబాబునాయుడు తన పాలనంతా దోచుకోవడం, దాచుకోవడం మాత్రమే చేశాడని విమర్శించారు. తొలుత దివంగత నేత డాక్టర్ వైఎస్ రాజశేఖర రెడ్డి విగ్రహానికి పూలమాల వేసి బస్టాండ్ నుంచి పట్నం గ్రామం వరకు ఎమ్మెల్యే బైక్ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ అమరనాథ్‌రెడ్డి, జెడ్పీటీసీ రాధాబాయ్, సర్పంచ్ చలపతినాయక్, అగ్రి అడ్వయిజరీ బోర్డు జిల్లా మెంబర్ సుధీర్‌రెడ్డి,మాజీ సర్పంచ్ ఇంద్రప్రసాద్‌రెడ్డి, మండల కన్వీనర్ ప్రకాష్, నాయకులు మధుసూదన్‌రెడ్డి, మణికంఠ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

జిత్తులమారి చంద్రబాబును నమ్మొద్దు

తలుపుల: గతంలో మోసం చేసిన విధంగా జిత్తులమారి చంద్రబాబు నాయుడు ప్రజలను మళ్లీ మోసం చేయడానికి సిద్ధమవుతున్నాడని, ఆయన మాటలు నమ్మకూడదని ఎమ్మెల్యే సిద్దారెడ్డి అన్నారు. స్థానిక ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో బుధవారం గృహసారథులకు, సచివాలయ కన్వీనర్లకు, జేసీఎస్ కన్వీనర్లకు 'ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలి' అనే విషయాలపై మండల కన్వీనర్ పయాజ్ అహమ్మద్, ఎంపీపీ రఫినాయక్, జేసీఎస్ కన్వీనర్ టోపీరమణ ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ మా ప్రభుత్వం ద్వారా మంచి జరిగి ఉంటేనే ఓటువేయాలని సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి కోరడం ఎంతో గొప్పవిషయమన్నారు. దేశంలోనే ఏ రాష్ట్రంలో ప్రవేశపెట్టని విధంగా సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి నాలుగేళ్లలో సుమారు రూ. 2.30 లక్షల కోట్లు నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేశారన్నారు. పథకాల డబ్బు గత తెలుగుదేశం ప్రభుత్వం హయాంలో పెత్తందారుల చేతుల్లోకి వెళ్లాయన్నారు. నాటి పరిస్థితులు, నేటి పరిస్థితులను తేడాను గమనించాలని కోరారు. ప్రతి గడపకు వెళ్లి సమన్వయంతో అవగాహన కలిగించి, ఇవి మరలా రావాలన్నా, సంక్షేమ పథకాలు కొనసాగాలన్నా జగనన్నను ఆశీర్వదించాలని కోరాలన్నారు. మాజీ మార్కెట్‌యార్డు చైర్మన్ రామక్రిష్ణారెడ్డి, మాజీ సర్పంచ్‌లు సూర్యనారాయణరెడ్డి, పురుషోత్తంరెడ్డి, మధుసూదన్‌రెడ్డి,సేవాదళ్ జోనల్ ఇన్‌చార్జి డీకేబాబు(క్రిష్ణారెడ్డి), సర్పంచ్‌లు శ్రీరామ్‌రెడ్డి,షెక్షావలి, సుదర్శన్‌రెడ్డి,పెద్దినాయుడు, దేవేంద్రనాయక్, పాల్గొన్నారు.

పరామర్శ

మండలంలోని గెరికపల్లికి చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు పెద్ద రామాంజులురెడ్డి ఇటీవల పక్షవాతానికి గురై చికిత్స అనంతరం ఇంటికి వచ్చారు. విషయం తెలుసుకొన్న ఎమ్మెల్యే సిద్దారెడ్డి బుధవారం బాధితుని స్వగృహంకు వెళ్లి పరామర్శించి, ఆరోగ్య రీత్యా తగు సూచనలు చేశారు.

చదువుతో ధైర్యం, ఆత్మవిశ్వాసం


మాట్లాడుతున్న డైరెక్టర్ సాగర్‌మూర్తి

బత్తలపల్లి: 'చదువు ఉంటే జీవనోపాధి సంపాదించుకుంటావు, ఎవరిపైనా ఆధారపడకుండా నీ కాళ్లపై నిలబడతావు, ధైర్యం వస్తుంది, ఆత్మవిశ్వాసం లభిస్తుందని ఆర్డీటీ ఫండ్స్ మొబలైజేషన్ డైరెక్టర్ సాగర్‌మూర్తి అన్నారు. బుధవారం స్థానిక ఆర్డీటీ ఫీల్డ్ కార్యాలయంలో అంతర్జాతీయ బాలికల దినోత్సవం నిర్వహించారు. విద్యార్థుల తల్లిదండ్రులుగా ఏఎన్ఎం రాధ, ధ్యాన గురువు శంకరయ్య అధ్యక్షత వహించగా, ముఖ్యఅతిథులుగా సాగర్‌మూర్తితో పాటు హైదరాబాద్ లీలా, ఎస్ఐ శ్రీనివాసులు, హెచ్ఎం జయంతి హాజరయ్యారు. వారు మాట్లాడుతూ చదువుకుంటే సమాజంలో గుర్తింపుతో పాటు గౌరవం లభిస్తుందన్నారు. బాగా చదువుకుని ముందుకు వెళ్లాలని సూచించారు. అనంతరం ఎస్ఐ శ్రీనివాసులు మాట్లాడుతూ బాలికల పట్ల తల్లిదండ్రులలో మార్పు రావాలన్నారు. వారితో ప్రేమగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకునే ప్రయత్నం చేయాలన్నారు. ముఖ్యంగా బాల్యవివాహాలు చేయవద్దని సూచించారు. బాల్యవివాహాలు చేసే తల్లిదండ్రులపైన కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. మీరు బాగా చదువుకుని పై చదువుకులకు వెళ్తే ఇలాంటి బాల్య వివాహాలను అరికట్టవచ్చునన్నారు. కరోనా కంటే పెద్ద వైరస్ బాల్యవివాహాలన్నారు. ఇది అరికట్టేందుకు డాక్టర్లు, పోలీసులు అందరూ కృషి చేశారన్నారు. బాల్యవివాహాలను కూడా బాలికలు, తల్లిదండ్రులలో మార్పు వస్తే అరికట్టవచ్చునన్నారు. ఏవైనా సమస్యలుంటే టోల్ ఫ్రీ నెంబర్లుకు ఫోన్ చేయాలని సూచించారు. సమావేశంలో ఏటిఎల్ రుక్మాంగద, ఎస్టీఎల్ సద్గుణ, సీఓలు నాగరాజు, వెంకటేష్, తిమ్మరాజు, శివాజీ, మంజునాథ, నరేష్, శ్రీరాములు, శోభారాణి, ఉషాదేవితో పాటు ఉపాధ్యాయులు, విద్యార్థినీలు, వారి తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

మురికి నిల్వ లేకుండా చర్యలు

గాండ్లపెంట: మండల వ్యాప్తంగా గ్రామాల్లో ఎక్కడా మురికినీరు నిల్వ ఉండకుండా ఇంకుడు గుంతలు తీయించి నీరు ఇంకిపోయే విధంగా చర్యలు చేపట్టాలని డ్వామా ఏపీడీ శివశంకర్ సాంకేతిక, క్షేత్ర సహాయకులకు తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఉపాధి హామీ పథకం పనులపై వారాంతపు సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డ్రైల్యాండ్ హార్టికల్చర్ కింద మండల వ్యాప్తంగా చేపట్టిన పండ్లతోటల పెంపకం వివరాలు, వాటికి సంబంధించిన బిల్లులు, అదే విధంగా పక్కా గృహాలకు సంబంధించిన వివరాలను తెలుసుకున్నారు. లబ్ధిదారులకు ఇబ్బంది లేకుండా సకాలంలో బిల్లులు అందించాలని సూచించారు. సమావేశంలో ఏపీఓ మంజునాథ్, సాంకేతిక, క్షేత్రసహాయకులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనులను గుర్తించాలి

తాడిమర్రి: వచ్చే ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ఉపాధిహామీ పనులను గుర్తించాలని ఏపీఓ సంజీవరెడ్డి సాంకేతిక, క్షేత్ర సహాయకులను ఆదేశించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం ఆయన ఈసీ అశోక్‌కుమార్ రెడ్డితో కలిసి సాంకేతిక, క్షేత్ర సహాయకులు, కంప్యూటర్ ఆపరేటర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రణాళిక ప్రకారం గ్రామాల్లో రైతులు తమ పొలాల్లో ఉపాధిహామీ పనులు చేయించు కోవడానికి అవగాహన కల్పించాలన్నారు. మనం చేయించే ప్రతి పని రైతులకు ఎంతో ఉపయోగకరంగా ఉండాలని ఆయన తెలిపారు. ఉపాధిహామీ పథకం ద్వారా చీనీ, మామిడి, సపోటా తదితర పంటలు సాగు చేసిన రైతులను అప్రమత్తం చేసి పండ్లతోటల సాగుకు తీసుకోవలసిన జాగ్రతలను వివరించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధిహామీ సిబ్బంది పాల్గొన్నారు.

ఎమ్మెల్యేపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే ఖబడ్దార్


మాట్లాడుతున్న రేగాటిపల్లి సర్పంచ్ సురేష్‌రెడ్డి

ధర్మవరం: సర్పంచ్‌గా గెలవలేని జనసేన నాయకుడు రేగాటిపల్లి మధుసూదన్‌రెడ్డి ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే సహించేది లేదని రేగాటిపల్లి సర్పంచ్ సురేష్‌రెడ్డి హెచ్చరించారు. పట్టణంలోని రేగాటిపల్లి సురేష్‌రెడ్డి బుధవారం నివాసంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే కేతిరెడ్డి, ఆయన కుటుంబ సభ్యులపై, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌పై మధుసూదన్‌రెడ్డి స్థాయికి మించి మాట్లాడుతున్నాడన్నారు. కేతిరెడ్డి పెద్దారెడ్డి, కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి కాళ్లు పట్టుకొని ధర్మవరం వచ్చి ఉంటూ.. మళ్లీ వైఎస్సార్‌సీపీ నాయకులపై ఆరోపణలు చేయడం ఏంటని ప్రశ్నించారు. వరదాపురం సూరితో, ఇటు పరిటాల కుటుంబంతో సంబంధాలు పెట్టుకొని డ్రామాలు ఆడుతున్నాడన్నారు. మరోసారి ముఖ్యమంత్రిని, ఎమ్మెల్యే కేతిరెడ్డిని విమర్శిస్తే తగిన బుద్ధి చెపుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ రవీంద్రారెడ్డి, అప్పిరెడ్డి, సీతారామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పేదల ఆరోగ్యానికి ప్రభుత్వ భరోసా


రోగులకు జగనన్న ఆరోగ్య సురక్ష కిట్లు అందజేసిన ఎంపీపీ అంజలి


తనకల్లు మండలం గోళ్లవారిపల్లిలో పౌష్టికాహారంపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

చెన్నేకొత్తపల్లి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పేదల ఆరోగ్యానికి భరోసానిస్తూ జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం చేపట్టారని ఎంపీపీ అంజలి పేర్కొన్నారు. బుధవారం మేడాపురం గ్రామంలో వైద్య శిబిరం నిర్వహించారు. ఎన్ఎస్ గేటు పీహెచ్‌సీ వైద్యులు రవినాయక్ ఏఎన్ఎంలు ఆశావర్కర్లు ప్రజలకు సేవలందించారు. రక్త పరీక్షలు, బీపీ, షుగర్, ఈసీజీ, టీబీ, డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్, గర్భిణులకు పరీక్షలు చేశారు. మందులను ఉచితంగా అందజేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ షాబుద్దీన్, సర్పంచ్ రామాంజినేయులు, ఈఓఆర్డీ అశోక్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

గాండ్లవారిపల్లిలో..

ముదిగుబ్బ: మండల పరిధిలోని గాండ్లవారిపల్లిలో బుధవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. పేద ప్రజలకు వైద్య సేవలతో పాటు ఉచితంగా మందులను పంపిణీ చేస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ సీవీ నారాయనరెడ్డి అన్నారు. కంటి చూపు సరిగా లేని వారికి కంటి అద్దాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ సూర్యనారాయణ, ఎంపీడీఓ విజయలక్ష్మి, డాక్టర్లు నాగేంద్ర నాయక్, రాజేంద్ర, ఉప సర్పంచ్ చిన్న వీరనారప్ప, ఎంపీటీసీ నారాయణ, గ్రామ సచివాలయ కన్వీనర్ భాస్కర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ రామ్మూర్తి, ఆశా, అంగన్‌వాడీ కార్యకర్తలు, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

380 మందికి వైద్య సేవలు

పుట్టపర్తి అర్బన్: 'జగనన్న ఆరోగ్య సురక్ష'లో భాగంగా పుట్టపర్తి మండలం బత్తలపల్లిలో నిర్వహించిన వైద్య శిబిరంలో బత్తలపల్లి, గువ్వలగుట్టపల్లి గ్రామాలకు చెందిన 380 మంది పేదలకు వైద్య సేవలు అందించినట్లు వైద్యాధికారులు డీపీహెచ్ఎన్ఓ వీరమ్మ, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి క్రిష్ణయ్య పేర్కొన్నారు. బుధవారం బత్తలపల్లి సచివాలయంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని ఎంపీపీ ఏపీ రమణారెడ్డి, సర్పంచ్ మంగ్లీబాయి, వైద్యాధికారులు ప్రారంభించారు. కంటి పరీక్షలు అక్కడే నిర్వహించి మందులు, అద్దాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ నవీన్‌కుమార్, ఈఓఆర్డీ అశోక్‌కుమార్‌రెడ్డి, డాక్టర్లు జోత్స్న, నాగార్జున గౌడ్, పీహెచ్ఎన్ లలిత కుమారి, సూపర్‌వైజర్లు చంద్రకళ, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

సున్నంపల్లిలో..

ఓడీ చెరువు: మండలంలోని సున్నంపల్లిలో గ్రామంలో బుధవారం 'జగనన్న ఆరోగ్య సురక్ష' కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. 205 మందికి ఆరోగ్య పరీక్షలు, 72 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమానికి ఎంపీడీఓ వరలక్ష్మి, తహసీల్దార్ రామనాథరెడ్డి, మార్కెట్‌యార్డు చైర్మన్ శ్రీనివాసరెడ్డి, జెడ్పీటీసీ కుర్లి దామోదర్‌రెడ్డి, మైనార్టీ నాయకులు షామీర్‌బాషా, రాష్ట్ర వ్యవసాయ కార్యదర్శి అశ్వర్థరెడ్డి, వైఎస్సార్ సీపీ యూత్ కన్వీనర్ హరినాథరెడ్డి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పౌష్టికాహారంపై అవగాహన

తనకల్లు: మండల పరిధిలోని గోళ్లవారిపల్లిలో బుధవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. సీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ ముబీషీరా రోగులకు పరీక్షించారు. మందులను అందజేశారు. అనంతరం ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు జయమ్మ, లక్ష్మీదేవి ఆధ్వర్యంలో గర్భిణులకు సామూహిక శ్రీమంతాలను చేశారు. పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ పూల నరసింహులు, డీపీఎం అనురాధ, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


పుట్టపర్తి మండలం బత్తలపల్లిలో వైద్య పరీక్షలు

ఘనంగా అంతర్జాతీయ బాలికా దినోత్సవం


నల్లచెరువులో బాలికల మానవహారం


నల్లమాడలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

నల్లచెరువు: మండల కేంద్రంలోని గీతామందిరంలో ఆర్డీటీ సంస్థ ఆధ్వర్యంలో అంతర్జాతీయ బాలికల దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎస్ఐ లింగన్న, ఎంఈఓ తిరుపాల్ నాయక్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ర్యాలీ చేశారు. వైఎస్సార్ కూడలిలో మానవహారం నిర్వహించారు. ఎస్ఐ మాట్లాడుతూ ఎవరైనా బాల్య వివాహాలకు ప్రయత్నిస్తే వెంటనే 1098 లేదా 100,112 నంబర్లకు సమాచారం ఇస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో ఏరియా టీం లీడర్ సుకన్య,ఎస్టీఎల్ వనజ తదితరులు పాల్గొన్నారు.

నల్లమాడలో..

నల్లమాడ: ఆర్డీటీ ఆధ్వర్యంలో బుధవారం అంతర్జాతీయ బాలికల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. స్థానిక ఉన్నత పాఠశాల విద్యార్థినులచే పుర వీధుల్లో ర్యాలీ నిర్వహించారు. బాలికల విద్య, వారి రక్షణకు సంబంధించి ర్యాలీలో నినాదాలు చేశారు. అనంతరం ఆర్డీటీ ఏరియా కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో సంస్థ కదిరి రీజనల్ డైరెక్టర్ శాంతమ్మ, స్థానిక ఎస్ఐ వలీబాషా ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం భాస్కర్‌రెడ్డి, వీఆర్ఓ శారదాబాయి, ఏటీఎల్ వన్నూరుస్వామి, ఎఫ్ఎన్ఓ శ్రీవాణి, సభ్యులు శివమ్మ, సురేష్, సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

బాలికలకు సమాన అవకాశాలు కల్పించాలి

ఎన్పీకుంట: బాలికలకు సమాన అవకాశాలు కల్పించాలని ఎంపీడీఓ ఆదినారాయణ అన్నారు. అంతర్జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా బుధవారం మండల పరిధిలోని టీ.ఎస్.పల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆర్డీటీ ఆధ్వర్యంలో బాలికా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎంపీడీఓ, తహసీల్దార్ హాజరై మాట్లాడుతూ సమాజంలో ప్రతి బాలిక చదువుకోవడం ద్వారా భవిష్యత్తులో వారి ఇళ్లలో వెలుగులు నిండుతాయన్నారు. అనంతరం విద్యార్థినులకు ఆటల, పోటీలు నిర్వహించి బహుమతులు ప్రదానం చేశారు. పాఠశాలలో ఆర్డీటీ సంస్థ వ్యవస్థాపకులు ఫాదర్ విన్సెంట్ ఫెర్రర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో తహసీల్దార్ నరేంద్రకుమార్, ఎంపీడీఓ ఆదినారాయణ, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మురళీక్రిష్ణ, ఆర్డీటీ సీపీ డైరెక్టర్ క్రిష్ణవేణి, ఏటిఎల్ క్రిష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

ముదిగుబ్బలో ..

ముదిగుబ్బ: మండల కేంద్రంలో బుధవారం అంతర్జాతీయ బాలికా దినోత్సవాన్ని ఆర్డీటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. విద్యార్థినులతో కలిసి ర్యాలీని నిర్వహించారు. వ్యాసరచన, క్రీడా పోటీలను నిర్వహించారు. గెలుపొందిన వారికి బహుమతులను ప్రధానం చేశారు. కార్యక్రమంలో ప్రసన్నకుమార్, ఎంఎల్‌హెచ్‌పీ కావేరి, ప్రధానోపాధ్యాయురాలు రమాదేవి, పీడీ సురేఖ, ఏటీఎల్ సంజీవరెడ్డి, యల్లమ్మ తదితరులు పాల్గొన్నారు.

ధర్మవరంలో..

ధర్మవరం అర్బన్: పట్టణంలోని కాకతీయ విద్యానికేతన్ ఇంగ్లిష్ మీడియం హైస్కూల్‌లో బుధవారం అంతర్జాతీయ బాలికల దినోత్సవం పాఠశాల కరస్పాండెంట్ నిర్మలా జయచంద్రారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. సేవ్ గర్ల్ అనే ప్లకార్డులు ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వివిధ రంగాల్లో రాణించిన కల్పనా చావ్లా, పీటీ ఉష, ఇందిరాగాంధీ, కిరణ్‌బేడీలను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ పద్మ, ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

బాలికల ఉన్నతికి తోడ్పాటునందించాలి

కనగానపల్లి: బాలికలు ఉన్నత స్థానాల్లో నిలవడానికి వారి తల్లిదండ్రులు సరైన తోడ్పాటునందించాలని ఆర్డీటీ డైరెక్టర్ నిర్మల్‌కుమార్ తెలిపారు. బుధవారం ఆర్డీటీ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో అంతర్జాతీయ బాలికల దినోత్సవాన్ని నిర్వహించారు. ఉన్నత పాఠశాలల విద్యార్థినులతో కలసి ఆర్డీటీ సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. ఆటల పోటీలు, వ్యాసరచన పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. ఏటీఎల్ రఘురాం, స్థానిక పాఠశాలల ప్రధానోపాధ్యాయులు లక్ష్మిదేవి, రవికిరణ్, ఆర్డీటీ సిబ్బంది పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

ప్రణాళికలు తయారు చేయండి

కొత్తచెరువు: గ్రామస్థాయిలో జీవనోపాధి, మౌలిక సదుపాయాల కోసం పంచాయతీ స్థాయిలో ప్రణాళికలు తయారు చేయాలని ఏపీఎం రవీంద్రారెడ్డి తెలిపారు. బుధవారం వెలుగు కార్యాలయంలో యానిమేటర్లు, లీడర్లతో సమావేశం నిర్వహించారు. అందరి సహకారంతో ముందుకెళ్లాలన్నారు. కార్యక్రమంలో ఏపీఓ నాగిరెడ్డి, మండల సమాఖ్య అధ్యక్షురాలు అనూరాధ, పాల్గొన్నారు.

పోస్టర్ల విడుదల

కదిరి అర్బన్: స్థానిక ఎస్టీఎస్ఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈ నెల 13న జరిగే జాబ్‌మేళాకు సంబంధించిన పోస్టర్లను ఎమ్మెల్యే పీవీ సిద్దారెడ్డి ఆయన నివాసంలో ఆవిష్కరించారు. ఈ నెల 13న జరిగే జాబ్ మేళాను నిరుద్యోగులు వినియోగించుకోవాలని ఎమ్మెల్యే సూచించారు. వివరాలకు 9390176421 నంబర్‌కు సంప్రదించాని కోరారు.

మట్టి ట్రాక్టర్‌పై జరిమానా

ధర్మవరం: అక్రమంగా మట్టిని తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకుని జరిమానా విధించామని తహసీల్దార్ యుగేశ్వరిదేవి తెలిపారు. ధర్మవరం మండలం రావులచెరువు గ్రామంలోని చెరువు నుంచి మట్టిని అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకుని రూ.25 వేలు జరిమానా విధించామని తహసీల్దార్ తెలిపారు.

పంచాయతీల అభివృద్ధి బాట

బత్తలపల్లి: సమష్టి కృషితో గ్రామ పంచాయతీలను అభివృద్ధి బాట పట్టిద్దామని ఎంపీడీఓ, పీడీఐ (పంచాయతీ డెవలప్‌మెంట్ ఇన్‌డెక్స్) చైర్మన్ సాయి మనోహర్ అధికారులకు సూచించారు. బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మండలస్థాయి అధికారుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గడిచిన సంవత్సరంలో గ్రామ పంచాయతీలలో జరిగిన వివిధ అభివృద్ధి కార్యక్రమాలను ఆయా శాఖల వారీగా నమోదు చేయాలన్నారు. తద్వారా ఆయా పంచాయతీలకు ర్యాంకులను కేటాయిస్తారన్నారు. సమావేశంలో తహసీల్దార్ యుగేశ్వరీదేవి, ఎస్ఐ శ్రీనివాసులు తదితరులు మాట్లాడారు. ఎంఈఓ సుధాకర్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి ఆత్మహత్యాయత్నం

నల్లచెరువు: కమ్మవారిపల్లి గ్రామంలో నివాసముండే మనోహర్ రావు కుటుంబ కలహాలతో బుధవారం విషద్రావకం సేవించి ఆత్మహత్యాయత్నం చేశాడు. స్థానికులు తెలిపిన మేరకు.. కమ్మవారిపల్లి గ్రామంలో నివాసముండే మనోహర రావు, మంజులభాయి దంపతులు. గత కొంత కాలంగా తరచూ గొడవ పడేవారు. గత శనివారం గొడవ తీవ్రమైంది. మంజుల భాయి తన పుట్టింటికి వెళ్లింది. దీంతో మనస్తాపం చెందిన మనోహర్ రావు బుధవారం సాయంత్రం ఇంట్లో ఎవరూ లేని సమయంలో విష ద్రావకం సేవించాడు. స్థానికులు 108 వాహనంలో కదిరి ఏరియా ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో అనంతపురం తీసుకెళ్లాలని వైద్యులు తెలిపారు.

వైఎస్సార్ టీఎఫ్ నూతన కార్యవర్గం

ఓడీ చెరువు: మండల వైఎస్సార్ టీఎఫ్ నూతన కార్యవర్గాన్ని జిల్లా ప్రధాన కార్యదర్శి పీవీ రమణారెడ్డి ఆధ్వర్యంలో బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల గౌరవాధ్యక్షులుగా ఎస్. భాస్కర్‌రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నరేష్, అధ్యక్షునిగా పీ. శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శిగా మధుసూదన్‌రెడ్డి, కోశాధికారిగా చంద్రమోహన్, ఉపాధ్యక్షునిగా అంజన్‌రెడ్డి, సుకన్య, శ్రీనివాసరెడ్డి, రవిక్రిష్ణ, కార్యదర్శులుగా జిలాన్, జనార్ధన్, సుధాకర్‌రెడ్డి, జిల్లా కౌన్సిలర్లుగా లక్ష్మినరసప్ప, శ్రీనివాసులరెడ్డి, రమేష్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.